# కేంద్ర ప్రభుత్వ నిర్బంధ చట్టాలు... నిరంకుశ విధానాలు

ఈ సంవత్సరం ఏప్రిల్ రెండవవారంతో మొదలై, మే నెల మూడవ వారంతో ముగిసిన 17వ లోక్‌సభ ఎన్నికలలో భారతీయ జనతాపార్టీ ఊహించినదానికి మించిన భారీ మెజారిటీతో గెలుపొందింది. భారత బడా బూర్జువావర్గం, వారి వెనుక ఉన్న సామ్రాజ్యవాదశక్తులు ఈ ఎన్నికలలో భాజపాకు వత్తాసుగా నిలిచాయి. ఈ సందర్భంగా విపరీతమైన జాతీయ, మత ఉన్మాదాలను, దుష్ప్రచారాలను సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టారు. కార్మికులు, రైతాంగము, ఇతర పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల జోలికి పోకుండానే, పక్కదారి పట్టించే చర్చలు చేసి గెలుపును కొనుక్కున్నారు.

20-6-2019 నుండి 6-8-2019 నడుమ 17వ లోక్‌సభ సమావేశమయి ప్రజల జీవితాల్ని తీవ్రంగా ప్రభావితం చేసే అనేక - 30కి పైగా - కొత్త బిల్లులను ఆమోదించింది; పాతవాటిని సవరించింది. పౌర హక్కులను క్రూరంగా అణచివేసే 'ఉప' చట్టం సవరణ, ముస్లిం మహిళల 'మూడు తలాక్'ల బిల్లు, పాత కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కోడ్‌లు, వైద్య విద్యలో తీవ్రమైన మార్పులు, సమాచార హక్కు చట్టం నీరుకార్చడం, రహదారుల భద్రత, పౌరుల సౌకర్యాల పేరిట రవాణారంగంలో రాష్ట్రాల అధికారాలను కేంద్రానికి దఖలు పరుచుకోవడం, సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య పెంపుదల, ఎస్సీ జెడ్ చట్టంలో సవరణలు, ఆధార్‌కార్డ్‌కు విస్తృత అధికారిక గుర్తింపు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన బిల్లు తదితరాలతో పాటు జాతీయ నేర పరిశోధన (ఎన్‌ఐఎ) విభాగపు అధికారాల పెంపు లాంటివి 30కి పైగా చట్టాలను, సవరణలను ఆమోదించింది. మొదటగా 2019-2020వ సంవత్సరపు ఆర్థిక బడ్జెట్టు బిల్లును, ముగింపుగా మెరుపు దాడితో జమ్మూ అండ్ కాశ్మీర్ విభజన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్నారు. కాశ్మీరుకు ఇప్పటివరకు గల ప్రత్యేక ప్రతిపత్తి హక్కును రద్దు పరుస్తూ 370వ అధికరణంలో మార్పులను చేశారు. తమ ఆధిపత్య విస్తరణకు తోడ్పడే ప్రతి చిన్న అవకాశాన్ని మూక బలంతో సాధించుకునే ప్రయత్నం భాజపా పాలకులు చేస్తున్నారు. చాలామంది పార్లమెంటు సభ్యులకు ముసాయిదా బిల్లులను తగినంత ముందుగా పంపకుండానే, వాటిపై సరియైన చర్చ జరగకుండానే తమకు మెజారిటీ ఉందన్న అదరగండంతో ఇన్ని ప్రజా వ్యతిరేక, పచ్చి నిరంకుశ చట్టాలను చేశారు. ప్రజలలో గూడుకట్టుకుని ఉన్న అసంతృప్తి ఆందోళనలకు దారితీయకుండా కొత్త నిరంకుశ చట్టాలు, పాత చట్టాలకు క్రూర సవరణలు చేశారు. ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడిచే అనేక నిర్ణయాలను చేశారు. అయినప్పటికీ తెలుగు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్, వైసిపి పార్టీలుగానీ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి గానీ ఏ ఒక్క బిల్లును వ్యతిరేకించకుండా అన్నింటినీ ఆమోదించి తమ ప్రజా వ్యతిరేకతను చాటుకున్నారు.

**తలాక్ - తలాక్ - తలాక్ బిల్లు ....**

ఇరవై సంవత్సరాలకు పైగా పెండింగ్‌లో ఉన్న చట్టసభలలో మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి వాగ్దానాలు తప్ప పాలక రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బిజెపిలు చట్టం చేయటానికి పూనుకోలేదు. ముస్లిం సమాజంలో ఉన్న తలాక్ తలాక్ తలాక్ అని ముమ్మారు పురుషుడు చెబితే విడాకులు ఇచ్చినట్లేనని భావించే దురాచారాన్ని అరికట్టటం పేరుతో ఈ చట్టం చేశారు. ఇది ఇంతకుముందే మూడు సార్లు ఆర్డినెన్సులు జారీ చేసినా రాజ్యసభలో ఆమోదం పొందలేక రెండుసార్లు తిరస్కరణకు గురైంది. సుప్రీంకోర్టు ఈ దురాచారాన్ని రద్దు పరుస్తూ 2 సంవత్సరాల క్రితం తీర్పును కూడా ఇచ్చింది. అంతేకాదు దీనికోసం ప్రత్యేకమైన చట్టం చేయవలసిన పని లేదని కూడా మెజారిటీ న్యాయమూర్తులు తీర్పులో పేర్కొన్నారు. ఒకరకంగా పై దురాచారం చట్టబద్ధంగా సుప్రీంకోర్టు తీర్పుతో నిషేధానికి గురైనట్లే! మీడియాలో ప్రచారం అవుతున్న అంత ప్రబలంగా కూడా ఈ దురాచారం లేదు. కానీ భాజపా పాలకులు తమ ముస్లిం విద్వేష రాజకీయాలకు ఒక తీపి పూత పూయటానికి, వాస్తవంగా ముస్లింలలో అంత ప్రబలంగా లేని ఈ దురాచారానికి వ్యతిరేకంగా ఒక చట్టం చేసేశారు. అతిక్రమించినవారికి 3 సం॥ జైలు శిక్ష అంటూ సివిల్ విషయాల్లోకి క్రిమినల్ విషయాలను జొప్పించారు. భారతదేశంలో విభిన్న మతాలు ఉన్నాయి. ప్రతి మతంలోను ప్రత్యేకించి హిందూ మతంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా, వారు నిత్యం జపంచేసే మనుస్మృతికి వ్యతిరేకంగా వ్యాఖ్యానించే పనికి, చట్టాలు చేసే పనికి భాజపా పాలకులు పూనుకోలేదు. ముస్లింలలో ఉన్న దురాచారం మాత్రమే వారికి కనబడింది.

**కార్మికుల హక్కులను హరించే చట్టాలు - చట్టసవరణలు**

కార్మిక చట్టాల సవరణ పేరుతో నూరేళ్ళ కు పైగా అనేక పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాచే వైపుగా మరో చట్ట సవరణ ఈ సమావేశాలలోనే చేశారు. నలభై నాలుగు రకాల కార్మిక చట్టాలను నాలుగుగా కుదించటం పేరుతో ఈ సవరణలు తలపెట్టారు. అయితే ప్రస్తుతానికి 4 రకాల పాత చట్టాలను సవరించి ఒకే వేతన చట్టం చేశారు. అలాగే 13 రకాల పాత చట్టాలను సవరించి వృత్తి సంబంధ ఆరోగ్యం, భద్రత మరియు పని పరిస్థితుల గురించి మరొక చట్టం ఆమోదించుకున్నారు. ఇవన్నీ భారత పారిశ్రామిక యాజమాన్య వర్గాలు ఎన్నికల ముందు మోడీ ప్రభుత్వాన్ని కోరుకున్న విధంగానే, వారికి మిక్కిలి సంతోషం కలిగించే విధంగానే కార్మికులకు వ్యతిరేకమైన ఈ కార్మిక చట్టాల సవరణ చేశారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా కార్మిక శ్రమశక్తిని విలువ కట్టడం కాకుండా, హేతుబద్ధమైన కనీస వేతన

విధానాన్ని కాకుండా నెలకు కనీసం 18 వేల రూపాయలు ఉండాలనే 46వ లేబర్ కాన్ఫరెన్సు సిఫార్సుని పెడచెవినబెట్టి తమ ఇష్టానుసారం చట్ట సవరణ చేశారు. ప్రస్తుత కార్మిక మంత్రి సతీష్ గ్యాంగ్వార్ గత ప్రభుత్వంలో కూడా కార్మిక మంత్రిగా ఉంటూ 2018 జనవరిలో వేతన సిఫారసుల కొరకు ఒక నిపుణుల కమిటీని నియమించాడు. వారు దీనిని కుదించి 2012 నాటి ధరవరల ప్రకారం నెలకు 9750 నుండి 11,622 రూపాయల కనీస వేతనాన్ని సూచించారు. దాని ప్రకారం రోజుకి 375 నుండి 477 రూపాయల వరకు కనీస వేతనం ఉండాలన్నమాట !

అయితే దేశమంతటా ఒకే జాతీయ సార్వత్రిక కనీస వేతనం ఉండాలని, అంతకంటే తక్కువ వేతనం ఎవరూ ఇవ్వకూడదని చెప్పుకుంటూ 2019లో చేసిన చట్టం కనీస వేతనం రోజుకు 178 రూపాయలుగా నిర్ణయించింది. అంటే నెలకు 26 రోజులు చొప్పున 4628 రూపాయలు అన్న మాట! దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో నిర్ణయింపబడిన ఈ కనీస వేతనం కంటే తక్కువ లేకుండా చూడటం కొరకు అన్నట్టు పాలకులు ప్రచారం చేసుకుంటున్నారు. ఇది ఇప్పటికే అమలులో ఉన్న రోజుకు 176 రూపాయల కంటే రెండే రెండు రూపాయలు పెంచి నిర్ణయించినది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేతనం ఏవిధంగానూ సరిపోదని తెలిసినప్పటికీ భాజపా పాలకులు అత్యంత అమానవీయ అనాగరిక వేతన విధానాన్ని ప్రకటించడానికి ఏమాత్రం జంకలేదు. పెట్టుబడి దారుల కోర్కెల కనుగుణంగా హైర్ అండ్ ఫైర్ విధానాలకు ప్రభుత్వమే ఊతం కల్పించింది. బోనస్ అన్నది లాభాలలో కార్మికులకు పంచి ఇవ్వవలసిన భాగం కాదనీ అది కోల్పోయిన వేతనమనీ కనుక అది ప్రతి కార్మికుడు పొందవలసిన హక్కని 45 ఏళ్ల క్రితం సుప్రీం కోర్టు ఒక తీర్పు చెప్పింది. పాలకులు దానిని ఏనాడు అమలు పరచక పోగా ప్రస్తుతం అయితే దాని ఊసే లేకుండా చేశారు. రోజుకు 8 గంటల కంటే ఎక్కువ పని చేసినట్లయితే ఓవర్ టైం ఇవ్వాలనే నిబంధన 70 సంవత్సరాల నుంచి ఉన్నది. నేటి బిల్లులో దాని ఊసు కూడా లేదు. ఇంకా ధరల పెరుగుదలకు అనుగుణంగా మూడు నెలలకు ఒకసారి, ఆరు నెలలకు ఒకసారి కరువు భత్యం పెంపుదల చట్టబద్ధంగా నిర్ణయించవలసి ఉండినా ప్రభుత్వం పట్టించు కోలేదు.

**సమాచారహక్కును నీరుగార్చే సవరణ**

సమాచార హక్కు చట్టం కూడా సవరణ కు గురైన వాటిలో ఒకటి. అనేక ప్రజాతంత్ర ఆందోళనల ఫలితంగా 2005లో రూపు దిద్దుకుంది సమాచారహక్కు చట్టం. వ్యక్తిగత విషయాలు, దేశరక్షణ సంబంధిత విషయాలు మినహా ప్రభుత్వంలో జరిగిన, జరుగుతున్న వ్యవహారం ఏదైనా పది రూపాయల చలానాతో తెలుసుకోగలిగే సమాచార హక్కు సామాన్య పౌరులకు కూడా దీనివల్ల లభించింది. ఈ శాఖకు కేంద్ర స్థాయిలో ముఖ్య కమిషనర్‌తో పాటు సహకమిషనర్లు తదితరులు ఉంటారు. రాష్ట్రాల స్థాయిలో కూడా కమిషనర్లు ఉంటారు. కేంద్ర సమాచార హక్కు కమిషన్ సభ్యులను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లే, రాష్ట్రస్థాయి సమాచార హక్కు కమిషన్ను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఎన్నికల కమిషన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లాగానే సమాచార హక్కు శాఖకు అటానమస్ (స్వయం ప్రతిపత్తి) అధికారాలు ఉన్నాయి. ఈ స్వయంప్రతిపత్తి అధికారాలే భాజపా పాలకులకు ఇష్టం లేకుండా పోయింది. అందుకే వాటి స్థాయిని కుదించారు. రాష్ట్ర కమిషనర్ల నియామకం రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం ప్రకారం ఇప్పటివరకు అమలు జరిగేది. ఇకనుండి సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్లను కూడా కేంద్ర ప్రభుత్వమే నియమించుకునే విధంగా అధికారాలను దఖలు పరుచుకుంటూ చట్టాన్ని సవరించారు. అంతే కాకుండా కేంద్ర, రాష్ట్ర కమీషనర్ల పదవీకాలం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వమే నిర్ణయించే విధంగా చట్టంలో మార్పులు చేశారు. దానితో సమాచార హక్కు చట్టం శాఖకు ఇప్పటివరకు ఉండిన స్వయంప్రతిపత్తి లేకుండా పోవడమే కాక ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై నిత్యం ఆధారపడే వ్యవస్థ కింద దానిని మార్చారు. సుప్రీంకోర్టు జడ్జిలు, కేంద్ర ఎన్నికల కమిషన్ స్థాయితో సమానమైన హోదాను తొలగించారు. తమ అవినీతిని బహిర్గత పరిచే సమాచారాన్ని ప్రజలకు అందనివ్వకుండా భాజపా పాలకులు అడ్డు తగల దలుచుకున్నారు. ఆ విధంగా సమాచార హక్కును పొందే పౌర స్వేచ్ఛకు కళ్ళాలు బిగించారు. అధికారంలో ఉన్నవారి అవినీతి బహిర్గతం కానివ్వకుండా చేసుకునే తాపత్రయానికి ఈ చట్ట సవరణ ఒక నిదర్శనం.

**నిర్బంధచట్టాల కోరలకు పదను**

అణచివేతలకు అదనపు కోరలు అందించే రెండు రకాల చట్ట సవరణలు కూడా చేశారు. వాటిలో ఎన్ఐఏ అధికార పరిధిని విస్తృత పరచడం ఒకటైతే, రెండవది 'ఉప' చట్టం. 2008లో జరిగిన ముంబాయి దాడులు కర్కరే హత్యల తర్వాత నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అనే కొత్త పోలీసు వ్యవస్థను మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఏర్పరచింది. టెర్రరిస్టు చర్యలను జరగక ముందు కనిపెట్టడం, జరిగిన తరువాత విచారణ చేపట్టడం దాని పరిధిగా ఉండేది. ఇప్పుడు సవరించిన చట్టం ప్రకారం 1. వ్యభిచార కేంద్రాల కు తరలింపు (హ్యూమన్ ట్రాఫికింగ్), 2. దొంగనోట్ల ముద్రణ, 3. నిషిద్ధ ఆయుధాల తయారీ, 4. సైబర్ టెర్రరిజం, 5. పేలుడు పదార్థాల చట్టం(1908) పరిధిలోని నేరాలు కూడా ఎన్ఐఏ పరిధిలోకి వచ్చే విధంగా చట్ట సవరణ చేశారు. ఇప్పటివరకు ఇవన్నీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పోలీసుశాఖలు నిర్వహిస్తూ ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వాల పరిధిలో సాగుతున్న ఐదు రకాల విచారణాధి కారాలను కేంద్ర ప్రభుత్వం తన గుప్పిటలోకి గుంజుకున్నది. పేరుకు ఫెడరల్ (సమాఖ్య తరహా పరిపాలన) వ్యవస్థ, ఆచరణలో కేంద్రీకృత యూనిటరీ పరిపాలనకు ఇదొక సరికొత్త ఉదాహరణ మాత్రమే!!

హిందూమతం పేరిట టెర్రరిస్టు కార్య కలాపాలు నిర్వహించే వారిని (ఉదాహరణకు అభినవ భారత్ వారి బాంబు కేసులు, సనాతన సంస్థాన్ వారి హత్యాకాండ) ఎన్ఐఏ అరికట్టలేక పోయింది, నీరు కార్చే విధంగా వ్యవహరిస్తూ ఉంది.

'ఉప' చట్టానికి నూరేళ్ళ క్రితపు వలస పాలకుల రౌలట్ చట్టంలో మూలాలు ఉన్నాయి. చైనా దేశంతో సరిహద్దు సంఘర్షణ తర్వాత 1963లో దేశ సమగ్రత సార్వభౌమత్వాల పరిరక్షణ పేరిట జరిపిన 16వ రాజ్యాంగ సవరణ ఆధారంగా

1967లో చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం చేశారు. దాని నుండే టాడా, పోటాలాంటి చట్టాలు పుట్టి ప్రజాందోళనల ఫలితంగా రద్దయినాయి. 'ఉప' చట్టంకు 2004లో మన్మోహన్ ప్రభుత్వం కొన్ని సవరణలు చేసింది. టెర్రరిజంను నిర్వచించి, అలాంటి సంస్థలను 'ఉప' చట్టం కింద నిషేధించ వచ్చునంది. ఆ చట్టం అమలును ఎన్ఐఏ కు బదలాయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల నుండి గుంజుకొని కేంద్రం తన అధికారాలుగా మార్చుకుంది. టాడా పోటా చట్టాలు పోయినా 'ఉప' చట్టం ద్వారా పై తరహా నిర్బంధాలను పాలకులు కొనసాగిస్తూ ఉన్నారు. ఇప్పుడు ఆ చట్టానికి మరింత విస్తృత అధికారాలను అందించే సవరణలు చేశారు.

ఇకనుండి సంస్థలను మాత్రమే టెర్రరిస్టువి అనే కాకుండా వ్యక్తులను కూడా టెర్రరిస్టులుగా ఆరోపించి ఎలాంటి విచారణ జరపకుండా నిర్బంధించే అధికారాలను ఉప చట్టం పాలకులకు ఇస్తుంది. "ఈ చట్టానికి భయపడే వారందరూ టెర్రరిస్టులయి ఉంటారు" అని హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటించడాన్ని బట్టి నిరసన గొంతులను, ప్రజాతంత్ర గొంతులను వినపడనివ్వకుండా చేయడమనే క్రూర ఆలోచన ఇందులో ఉంది. పాలకులు భావించే టెర్రరిజం వ్యాప్తికి సహాయపడే వ్యక్తులను కూడా టెర్రరిస్టులని పేరు పెట్టొచ్చు. "టెర్రరిస్టు కార్యకలాపాలకు ఆర్థిక సహాయం చేసేవారందరూ టెర్రరిస్టులే! టెర్రరిస్టు భావజాలాన్ని-సాహిత్యాన్ని-వ్యాప్తి చేసేవారందరూ టెర్రరిస్టులే!! "ఇవి కూడా పార్లమెంటులో హోంమంత్రి గారి మాటలే.

ప్రపంచ ప్రఖ్యాత రచయిత టాల్‌స్టాయ్ రచించిన 'యుద్ధము-శాంతి' నవల కూడా నిషిద్ధ గ్రంథం లాగా హైకోర్టు జడ్జి స్థాయి వారికి అనిపించిందంటే భగత్‌సింగ్ రచనలు కూడా నిషిద్ధాలు అయితే ఆశ్చర్యపడవలసినది ఏమీ లేదు. ఇప్పటికే 'ఉప' చట్టం కింద సంవత్సరం క్రితం అరెస్టు కాబడిన వరవరరావు, సుధా భరద్వాజ తదితరులు కనీస విచారణ లేకుండా జైళ్ళల్లో మగ్గుతున్నారు. కోరలు పెంచిన కొత్త చట్టం టెర్రరిజం పేరిట, సమస్త ప్రజాతంత్ర ఉద్యమాలను, వాటికి నాయకత్వం అందిస్తున్న సహాయపడుతున్న వారందరినీ నిర్బంధం పాలు కావించడం ఈ చట్ట సవరణ యొక్క అసలు లక్ష్యం. తీవ్రతరమవుతున్న సామాజిక సంక్షోభాన్ని దాని నుండి పెరుగుతున్న ప్రజా నిరసన, ఆందోళనలను అణచివేయా లన్నదే వారి ఊహ. పెరిగిపోతున్న అసమానతల వ్యవస్థను నిర్బంధ చట్టాల ద్వారా కాపాడు కోవాలన్నదే వారి దురాశ!!

**కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలపై గొడ్డలివేటు**

పార్లమెంటు జరిగిన చివరి రెండు రోజులలో, ఆగస్టు 5, 6 తేదీలలో, జమ్మూ కాశ్మీర్‌కు ఆర్టికల్ 370 , 35ఏలతో గల ప్రత్యేక హక్కులను రద్దు పరుస్తూ హడావిడిగా మరో చట్టం చేశారు. కాశ్మీర్‌లో రెండేళ్ల క్రితం పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ తో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపిన భారతీయ జనతా పార్టీ ఆ ప్రభుత్వాన్ని కూలిపోయేట్లు చేసింది. గవర్నర్ వ్యవస్థ ద్వారా మరో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడకుండా చూసింది. అక్కడ గవర్నర్ పరిపాలన నడుస్తుండగానే జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేసి లడక్ ప్రాంతాన్ని దాన్నుండి విడగొట్టి 2 కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. లడక్‌కు ఎన్నుకోబడిన అసెంబ్లీ అన్నదే లేకుండాను, జమ్మూకాశ్మీర్‌కు ఎన్నికలంటూ జరిగినా కేంద్రం అధీనంలోనే ఉండేట్లుగాను మార్చేసింది. ఈలోగా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి రాజ్యాంగంలోని 370వ అధికరణం ద్వారా ఉండిన స్వయంప్రతిపత్తి హక్కులను హరించి వేస్తూ, అలాగే ఆర్టికల్ 35ఏ చట్టం రద్దుద్వారా ఆ రాష్ట్ర సహజ వనరులపై ఆ రాష్ట్ర ప్రజలకు మాత్రమే గల అధికారాలను, ఆ రాష్ట్ర ప్రజలకు గల ఉపాధి హక్కులను రద్దు చేశారు. ఇది కాశ్మీర్ రాష్ట్ర ప్రజల ప్రజాస్వామ్య హక్కులపై నిస్సిగ్గుగా చేసిన దాడి. అంతేకాకుండా విశాల భారతదేశం లో గల ఏ రాష్ట్రంలోని వనరులైనా కేంద్ర ప్రభుత్వం అధీనంలో పెట్టుకునే హక్కులు తమకు ఉన్నాయని కేంద్రీకృత పాలనాధికార దర్పాన్ని అది ప్రదర్శించుకొంది. ఈ తరహా కేంద్రీకృత నిరంకుశ ఆధిపత్య పాలనా విధానం భారత దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు, సమస్త జాతుల ప్రజానీకపు స్వాతంత్ర్యేచ్ఛకు ప్రమాదకరం.

గడిచిన 30 ఏళ్లకు పైగా లక్షలాది సైనిక బలాల మోహరింపుతో కాశ్మీరీ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను అణచి ఉంచుతూ వస్తున్నారు. వాటికి అదనంగా మరో 40 వేల సైనిక బలగాలను ఆగస్టు మొదటి రోజులలో జమ్మూకాశ్మీర్‌కి తరలించి పార్లమెంటు ఉభయ సభలలో హడావిడిగా చట్టసవరణ చేసుకున్నారు. రెండు నెలలు గడుస్తున్నా నేటికీ నిర్బంధంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులకుగాని, స్తంభించిపోయిన ప్రజా జీవనానికిగాని వెసులుబాటు దొరకలేదు. పాఠశాలలు కళాశాలలు పనిచేయటం లేదు. రోగులకు వైద్య సదుపాయాలు అందటం లేదు. ప్రజానీకం యిళ్లలో నుండి స్వేచ్ఛగా బయటకు వచ్చి తమ రోజువారి వృత్తి సంబంధ కార్యకలాపాల్లో పాల్గొనలేక పోతున్నారు సరికదా కనీసం గృహ అవసరాలకు కావలసిన సరుకుల కోసం కూడా బయటకు వెళ్ళలేక పోతున్నారు. ఫోన్లు లేవు, ఇంటర్నెట్‌లు లేవు పత్రికలు విడుదల కావడం లేదు. కాశ్మీరు రాష్ట్రం రాష్ట్రాన్ని నిర్బంధ ఖైదు కొట్టు గా మార్చేశారు. ఇదంతా కాశ్మీరు ప్రజలని భారతదేశంలో ఎలాంటి ప్రత్యేక ప్రతిపత్తి లేకుండా పరిపూర్ణ విలీనం చేసుకోవడంగా చెబుతున్నారు. కాశ్మీరీ ప్రజల హృదయాలను క్రూరంగా గాయపరిచారు. కాశ్మీరీల సమస్య ఆ జాతి ప్రజల సమస్య. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అది ఎప్పటికైనా పరిష్కారమవ వలసిందే తప్ప నిర్బంధాల వల్ల, అణచివేతల వల్ల కాదు.

000